



బ్రిడ్జి నిర్మించక ముందు కనిమెట్ట, పాత జంగమాయపల్లి గ్రామాల ప్రజలు వాగులో రాకపోకలు సాగించిన మట్టి రోడ్డు



కనిమెట్ట, పాత జంగమాయపల్లి గ్రామాల మధ్య ఊకశెట్టి వాగుపై నిర్మించిన బ్రిడ్జి

40 ఏళ్ల కల సాకారం

- ఊకశెట్టి వాగుపై పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం
- పాత జంగమాయపల్లి, కనిమెట్ట ప్రజలకు తీరిన కష్టాలు
- ప్రారంభించని అధికారులు
- రాకపోకలు సాగిస్తున్న జనం

కొత్తకోట, మే 19: ఎన్నికల నినాదంగా ఉన్న కనిమెట్ట, పాత జంగమాయపల్లి గ్రామాల మధ్య గల ఊకశెట్టి (సరళా సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్) వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయ్యింది. 40 ఏళ్ల కల సాకారం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి లేనప్పుడు వానాకాలంలో వర్షాలు కురిస్తే ఆయా గ్రామాల ప్రజలకు మండలంతో సంబంధాలు తెగిపోయేవి. వరదలు వచ్చినప్పుడల్లా వాగులో ఉన్న రోడ్డు తెగిపోవడంతో కొత్తకోటకు రావాలంటే దేవరకద్ర వయా మహబుబ్‌నగర్ లేదా, అమ్మపూర్ టు మదనాపురం నుంచి చేరుకోవాల్సి వచ్చేది. బ్రిడ్జి నిర్మించి, సమస్యకు పరిష్కారం చూపాలని పాత జంగమాయపల్లి గ్రామస్థులు ఎన్నోసారు ఎన్నికలను కూడా బహిష్కరించారు.

పడవలపై భయంతో ప్రయాణం..



వర్షాకాలంలో పుట్టిలో తాడు సహాయంతో వాగు దాటుతున్న గ్రామస్థులు(ఫైల్)

వర్షాలు కురిసినప్పుడు ఊకశెట్టి వాగులో ఉన్న మట్టి రోడ్డు తెగిపోవడంతో దాతలు ఏర్పాటు చేసిన పడవలపై ప్రయలు భయం భయంగా ప్రయాణించేవారు. 2020 సంవత్సరంలో భారీ వర్షాలకు రోడ్డు తెగడంతో పాత జంగమాయపల్లి ప్రజల కష్టాలు వర్ణతీతంగా మారాయి. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ దివంగత ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి పడవ తెప్పించి, ప్రజలు వాగు దాటడానికి ఒకరిని నియమించారు. మరుసటి ఏడాది నుంచి కనిమెట్ట, పాత జంగమాయపల్లి ప్రజలు ఆలోచించి పడవను దాటించడానికి వ్యక్తి సహాయం లేకుండా తాడును ఏర్పాటు చేశారు. గత వర్షాకాలం వరకు ఈ తాడు ద్వారానే ప్రజలు వాగు దాటారు. రోడ్డు అటు చివర, ఇటు చివరకు తాడును ఏర్పాటు చేయగా అటు, ఇటు వెళ్లాల్సిన వారు పడవలో కూర్చుని, ఆ తాడును లాగితే ఒడ్డుకు చేరుకునే వారు.

సక్సెస్ అయిన మూడోసారి శంకుస్థాపన ...

బ్రిడ్జి నిర్మాణానికి మూడు సార్లు శంకుస్థాపన జరిగింది. టీడీపీ హయాంలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్తలో బ్రిడ్జి నిర్మాణానికి పాత జంగమాయపల్లిలో శంకుస్థాపన చేశారు. కానీ నిధుల మంజూరు జాప్యంతో నిర్మాణం జరుగలేదు. తెలంగాణ సిద్ధించాక ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం బ్రిడ్జి నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా వచ్చిన అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు బ్రిడ్జి డిజైన్‌ను తప్పుపట్టారు. దాంతో నిర్మాణం మారోసారి ఆగింది. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాక పట్టుబట్టి రూ.12 కోట్లా 30 లక్షలు మంజూరు చేయించారు. బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో బ్రిడ్జిని ప్రారంభించ లేదు. కానీ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో పాత జంగమాయపల్లి, కనిమెట్ట ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాలా కష్టాలు పడ్డాం



వర్షాలు కురిసి వాగులో రోడ్డు తెగిపోతే తాత్కాలిక మరమ్మతుల కోసం చాలా కష్ట పడ్డం. అప్పటి ఎమ్మెల్యేతో చర్చించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించుకున్నాం. రాత్రి వేళ వర్షం పడితే ఉదయం వాగు దగ్గరికి వెళ్లడమే పనిగా ఉండేది. వరదలకు రోడ్డు తెగిన సందర్భంలో ప్రజలను పడవలో వాగు దాటించడానికి మరొకరి సహాయం అవసరం ఉండేది. అందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కృష్ణానది సమీప గ్రామ ప్రజలతో మాట్లాడి ఎవరి అవసరం లేకుండా తాడు సాయంతో వాగు దాటేలా ఏర్పాటు చేశాం. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఆ కష్టాలన్నీ పోయాయి.

- గాదం రాణి, మాజీ సర్పంచ్, పాత జంగమాయపల్లి

బ్రిడ్జి పూర్తి కావడం సంతోషకరం



ఊకశెట్టి వాగుపై బ్రిడ్జి నిర్మించడంతో మా ఊరి ప్రజలకు ఆనందంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, లేదంటే మా ఊరికి రావొద్దని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని నిలదీశాం. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసుకొని వస్తానని చెప్పి, నెల రోజుల్లోనే ప్రొసిడింగ్‌తో వచ్చారు. మా విజ్ఞప్తిని ఆయన గౌరవించారు. అదే మాకు పదివేలు.

- కుమ్మరి కొండన్న, పాత జంగమాయపల్లి

- నాగనూల్ కల్లు తాగి రెండు నెలల్లో ముగ్గురు మృతి
- మతిస్థిమితం కోల్పోతున్న కల్లు ప్రియులు
- విపరీతంగా పెరుగుతున్న షుగర్ లెవల్స్‌తో పక్షవాతం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

విషం చిమ్ముతున్న కల్తీ కల్లు

నాగర్‌కర్నూల్, మే 19(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్‌లో కల్తీ కల్లు విషం చిమ్ముతోంది. కల్తీ కల్లు బారిన పడి రెండు నెలల వ్యవధిలో ముగ్గురు మృతి చెందినా ఎక్సైజ్ అధికారుల్లో చలనం కన్పించడం లేదు. నామమాత్రపు దాడులతో కల్లు నమూనాలను సేకరించి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించామనే మాట తప్ప కల్తీ కల్లు నిరోధానికి క్షేత్రస్థాయిలో ఎలాంటి కార్యాచరణ కన్పించడం లేదు.



గ్రామాలకు సరఫరా అవుతున్న కల్తీకల్లు(ఫైల్)

కల్లు కోసం నాగనూల్‌కు బారులు

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో ఉయ్యాలవాడ, దేశిటిక్యాల, ఎండబెట్ల గ్రామాలున్నాయి. నాగనూల్ గ్రామం మాత్రం జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్‌కు కేవలం కిలో మీటరు దూరంలో మాత్రమే ఉంది. మిగతా చోట్ల కల్లు దుకాణాలున్నప్పటికీ కేవలం నాగనూల్‌కు మాత్రమే తెల్లవారుజామున ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు కల్లు కోసం బారులు తీరుతున్నారు. వారిలో అత్యధికులు నాగర్‌కర్నూల్ పట్టణం, నాగనూల్ సమీప గ్రామాలైన అవురాసిపల్లి, వనపట్ల, చందుబట్ల గ్రామాలకు చెందిన వారు ఉంటున్నారు. నాగనూల్‌లో నాగర్‌కర్నూల్ నుంచి గుడిపల్లికి వెళ్లే రహదారిపై ఉన్న ఓ కల్లుదుకాణంలో ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే కోరల్‌హైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌ను కలిపి కృత్రిమ కల్లు తయారు చేస్తున్న విషయం బహిరంగ రహస్యంగా మారింది. షాక్రీన్, సిల్వర్, నిమ్మ ఉప్పు, మత్తును కలిగించే ఆల్ఫాజోలమ్‌ను కల్లులో విపరీతంగా కలపడం వల్ల కల్లు తాగిన వారిలో షుగర్ వ్యాధి రావడంతో పాటు, ఇతరత్రా అనారోగ్య కారణాలున్న వారిపై తీవ్ర దుష్ప్రభావాలను చూపుతోంది. షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు తీపికి దూరంగా ఉండాలి. అయితే కల్తీ కల్లు తయారీలో షాక్రీన్(చక్కెర ఎక్కువ ఉన్న పదార్థం) కలుపుతుండడంతో ఆ కల్లును తాగుతున్న వారిలో షుగర్ లెవల్స్ విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో మెదడుపై ప్రభావం చూపి, పక్షవాతానికి దారి తీస్తోంది. ఇలాంటి కారణాలతోనే రెండు నెలల వ్యవధిలో నాగర్‌కర్నూల్ పట్టణంలో ముగ్గురు మృతి చెందారు. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలున్నాయి.

ఎక్సైజ్ అధికారుల దాటవేత

కల్తీ కల్లుకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు వచ్చినా శాంపిళ్లు సేకరిస్తున్నామంటూ ఎక్సైజ్ అధికారులు దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 20 శాతం కల్లు మాత్రమే ఈత, తాటి వనాల ద్వారా వస్తోంది. మిగతాదంతా కల్తీ కల్లే. అందులో ఆల్ఫాజోలమ్, సీహెచ్, డైజోఫామ్ వంటి హానికరమైన మత్తుపదార్థాలు కలుపుతున్నారనే విషయం వారి అంతరాత్మకు కూడా తెలుసు. ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఆయా దుకాణాలపైకి వెళ్లి, కల్లు నమూనాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత వాటిని ల్యాబ్‌కు పంపించే క్రమంలో.. కల్లును మార్చి పంపిస్తున్నారంటూ ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు సేకరిస్తున్న కల్లు నమూనాల్లో 99 శాతం నిల్ రిపోర్టు వస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు.

మతిస్థిమితం కోల్పోతున్న కల్లు ప్రియులు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఒక కాలనీ నుంచి కొందరు మహిళలు ఇటీవల తీర్థయాత్రలకు బయల్దేరారు. వారిలో ముగ్గురికి నాగనూల్ కల్లు సేవించే అలవాటు ఉంది. ప్రయాణం మొదటి రోజున బాగానే ఉన్న వాళ్లు రెండవ రోజు నుంచి మతిస్థిమితం కోల్పోయారు. పిచ్చిపిచ్చిగా తిరుగుతూ కనిపించకుండా పోవడంతో సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు వారి ఆచూకీని తెలుసుకున్న పోలీసులు వారిని విచారించి డాక్టర్‌ను చూయించగా, కల్తీకల్లుకు బానిసలయ్యారని తేలింది. దీంతో నాగనూల్ నుంచి రెండు పెద్ద క్యాన్లల్లో 400 కిలో మీటర్ల దూరంలో ఉన్న వారి వద్దకు కల్లు తీసుకెళ్లి తాపిస్తే గానీ వారు పూర్వపు స్థితికి రాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నేటి నుంచి టెట్



- ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
- పదోన్నతి కోసం టీచర్లకూ ఎగ్జామ్ తప్పనిసరి అన్న ప్రభుత్వం
- ఈ విషయంపై స్పష్టత కరువు
- ఆందోళనలో ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 19: టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) సోమవారం నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రారంభం కానుంది. అందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు డీఎస్సీ కోసం బీఎడ్, డీఎడ్, పండిట్ ట్రైనింగ్ చేసిన వారు మాత్రమే టెట్ రాసేవారు. అది కూడా ఎగ్జామ్ ఆఫ్‌లైన్ విధానంలో ఉండేది. పేపర్-1, పేపర్-2 పరీక్షలు ఉండేవి. ఈ టెట్‌లో అర్హత సాధిస్తే ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసేందుకు అర్హత సాధించేవారు. కానీ ఈ ఏడాది ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాలని ప్రభుత్వం చెప్పడంతో ఉపాధ్యాయుల్లో టెన్షన్ మొదలైంది. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉన్న వారు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాలంటే టెట్ తప్పనిసరి అని చెప్పడంతో ఉపాధ్యాయులు టెట్‌కు దరఖాస్తు చేసకున్నారు. స్కూల్ అసిస్టెంట్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందాలన్నా టెట్ తప్పని సరి అని అధికారులు చెబుతున్నట్లు ప్రచారం జరుగడంతో పలువురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మాత్రం టీచర్స్‌కు టెట్ అవసరం లేదని చెబుతున్నాయి. దీనికి సంబంధించి విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఏమీ లేవని అంటున్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ అధికారులను, రాష్ట్ర మంత్రులను కలిసి టీచర్స్ పదోన్నతులకు టెట్‌కు ముడి పెట్టడం సరికాదని విన్నవించినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. దాంతో ఉపాధ్యాయులు టెట్ రాయాలా?, వద్దా? అనే డైలమాలో పడ్డారు.

ఇతర జిల్లాల్లో కేంద్రాలు

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు, టీచర్లు టెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ, మెదక్, ఖమ్మంతోపాటు పలు ఇతర జిల్లాల్లో కేంద్రాలు పడ్డాయి. దాంతో అంతదూరం ఎలా వెళ్లాలని వారు ఆందోళన చెందుతున్నారు. టెట్ ఆన్‌లైన్ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్ష ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం కానుంది.

విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- నాణ్యమైన విద్యతోపాటు క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్/చిన్నంబావి, మే 19: కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు గడిచిన 20 సంవత్సరాల నుంచి తనపై ఆదరాభిమానాలు చూపుతున్నారని, ప్రతీ ఎన్నికల్లో తన విజయం వెనుక నిలిచారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తనకు జన్మనిచ్చిన ఈ గడ్డలో భావి భారత పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించడంతోనే వారి రుణం తీరుతుందని, అదే తన లక్ష్యమని చెప్పారు. ఆదివారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చిన్నంబావి, పాన్‌గల్ మండలంలోని పెద్దదగడ, పెద్దమారు, కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం, పెంట్లవెల్లి మండల పరిధిలోని కొండూరు గ్రామాల పాఠశాలలను మంత్రి జూపల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని వర్గాల విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేలా ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయికి మించి వసతులు కల్పిస్తామన్నారు. నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీస్తామని, క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని అన్నారు. యావత్తు తెలంగాణ రాష్ట్రానికి కొల్లాపూర్ ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పారు. తన సొంత గ్రామమైన పెద్దదగడ, తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన పెద్దమారూరు ప్రభుత్వ పాఠశాలలతోపాటు కొండూరు, సింగోటం గ్రామాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, మోడల్ స్కూల్ మాదిరిగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థులకు కావాల్సిన వసతుల గురించి పాఠశాలల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. పేద ప్రజలు సంపాదించినదంతా పిల్లల చదువుల కోసం వేల రూపాయలు ఫీజులు కడుతూ కార్పొరేట్ బడుల్లో చదివిస్తున్నారని, ఆ స్థాయిలో వసతులు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు పోటీ పడతారన్నారు. విద్యార్థులు ఉదయం ఏడు గంటలకే పాఠశాలలకు వచ్చి, వారిని చదివించేందుకు ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల వదిలిన తర్వాత వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా వారు కృషి చేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలను, ఎన్ఆర్ఐలను, వివిధ వర్గాలను కలుపుకుని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. అనంతరం మంత్రి కొల్లాపూర్‌లోని తన నివాసంలో పంచాయతీరాజ్ అధికారులు, సింగోటం, కొండూరు, పెద్దమారు, పెద్దదగడ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఆయా పాఠశాలలకు కావాల్సిన వసతుల కల్పన పనులను ప్రారంభించి, పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చిన్నంబావి మండల మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణప్రసాద్ యాదవ్, నాయకులు కొత్త కల్యాణ్ రావు, బీచుపల్లి యాదవ్, చిదంబర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, చంద్రశేఖర్ యాదవ్, సురేందర్‌సింగ్, వెంకటస్వామి, హనుమంతు నాయక్, కౌన్సిలర్ రహీంపాష, మేకల నాగరాజు, నల్లపోతుల గోపాల్, నరసింహా యాదవ్, పాష పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

- నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలో ఘటన



పవన్ గౌడ్(ఫైల్)

అమ్రాబాద్, మే 19: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన నోముల పవన్ గౌడ్ (28) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ అచ్చంపేటలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం అమ్రాబాద్‌కు వచ్చాడు. ఫ్రెండ్స్‌ను కలిసిన అనంతరం ఇంటికి వచ్చాడు. ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్క ఇంటి వారు గమనించి తెలిపారు. పవన్ గతంలో కొంతకాలం అమ్రాబాద్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా కూడా పని చేశాడు. ఇటీవల అతని తల్లి అనారోగ్యానికి గురవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. అతని అన్న పెళ్లి చేసుకొని వేరుగా ఉంటున్నాడు. పవన్‌కు పెళ్లి కాలేదు. ఆర్థికంగా, మానసికంగా ఎవరూ సపోర్టుగా లేరనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

కారు బీభత్సం

- ఒకరికి గాయాలు
- టీ స్టాల్, కిరాణం షెట్టర్ ధ్వంసం
- వెల్దండలో ఘటన

వెల్దండ, మే 19: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో ఆదివారం అతివేగంతో వచ్చిన ఓ కారు బీభత్సం సృష్టించింది. ప్రమాదంలో ఒకరు గాయపడగా, ఒక టీ స్టాల్, కిరాణం దుకాణం షట్టర్ ధ్వంసమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ వైపు నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి, అదుపుతప్పి వెల్దండ ప్రధాన చౌరస్తాలో ఉన్న అల్లాజీ టీ పాయింట్‌ను ఢీకొట్టింది. దీంతో టీపాయింట్ పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో టీ స్టాల్ మూసి ఉన్నది. టీ స్టాల్ పక్కనే నిల్చొని ఉన్న వెల్దండకు వచ్చిన గోరటి చంద్రయ్యకు గాయాలయ్యాయి. తర్వాత పక్కనే ఉన్న వెంకటయ్య కిరాణ దుకాణాన్ని ఢీకొనడంతో షట్టర్ దెబ్బతిన్నది. చంద్రయ్య కుమారుడు వెంకటేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు, మేకలు మృతి

- నాగర్‌కర్నూల్ జిల్లా నిజంబాదలో ఘటన
- ఉండవల్లిలో పొంగిన వాగు

వంగూరు/ఉండవెల్లి, మే 19: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం నిజంబాదలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి, పాడి ఆవు, మూడు మేకలు మృతి చెందాయి. రైతు పెరుమళ్ల లింగమయ్య పొలంలో చెట్టు కింద తన ఆవును, గ్రామానికి చెందిన పాపయ్య మూడు మేకలను ఉంచారు. పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.1.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



పిడుగు పడి మృతి చెందిన ఆవు, మేకలు



ఉండవెల్లిలోని అనసూయమ్మ కాలనీలో ఉధృతంగా పారుతున్న వాగు

రాకపోకలకు ఇబ్బందులు

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం పడింది. దాంతో మండల కేంద్రంతో పాటు చిన్న ఆముదాలపాడు, కంచిపాడు, అలంపూర్ చౌరస్తా తదితర గ్రామాల్లో వాన కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామాలు చీకటిగా మారాయి. ఉండవల్లిలోని అనసూయమ్మ కాలనీ సమీపంలో గల వాగు నిండి పొంగడంతో గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వన్యప్రాణుల కదలికలపై.. రేపటి నుంచి సర్వే

- శాకాహార జంతువుల సంఖ్యను తెలుసుకునేందుకు..

మన్ననూర్, మే 19: అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలపై ఈ నెల 21 నుంచి 23 వరకు సర్వే నిర్వహించనున్నట్లు మన్ననూరు అటవీ రేంజ్ అధికారి ఈశ్వర్ తెలిపారు. అటవీ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే చేయనున్నట్లు చెప్పారు. పెద్ద పులుల ఆహారానికి అవసరమయ్యే శాకాహార జంతువుల సంఖ్యను తెలుసుకునేందుకు ఈ సర్వే చేపడుతున్నామన్నారు. అమ్రాబాద్, మన్ననూరు, దోమలపెంట, మద్దిమడుగు రేంజ్‌ల పరిధిలోని అన్ని బీట్‌లలో బీట్‌కు ముగ్గురు సిబ్బంది చొప్పున సర్వే చేస్తారన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఒంటి గంట వరకు రెండు కిలో మీటర్లు అడవిలో నడుస్తూ, సంచరించే వన్యప్రాణుల వివరాలను సేకరిస్తారన్నారు. కనిపించిన జంతువుల ఫొటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, ఎన్‌టీసీఏకు అనుసంధానిస్తారని పేర్కొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 35 సంచుల నల్లబెల్లం, నాలుగు లీటర్ల సారా స్వాధీనం

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కల్వకుర్తి, మే 19 : ఎక్సైజ్ దాడుల్లో 35 సంచుల నల్లబెల్లం (1050 కేజీల బెల్లం), 30కేజీల పటిక, 4లీటర్ల సారా స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జె.వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కల్వకుర్తి-తెలకపల్లి రహదారిలో శనివారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తుండగా కొల్లాపూర్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి, రాంబాబు మహేంద్ర బొలెరో వాహనంలో 35 సంచుల నల్లబెల్లం, 30కేజీల పటిక, 4లీటర్ల సారా తరలించడాన్ని గుర్తించినట్లు సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బొలెరో వాహనాన్ని, నల్లబెల్లం, పటిక, సారాను స్వాధీనపర్చుకుని భాస్కర్‌రెడ్డి, రాంబాబులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, సృజన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల చెంత.. నవాబ్‌పేట సంత



సంతలో కూరగాయలు కొంటున్న ప్రజలు

- దండిగా ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా

-వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య - దొంగల హల్‌చల్

నవాబ్‌పేట, మే 19 : వారం రోజులకోసారి జరిగే ఆదివారం సంత సమస్యల చింతగా మారింది. మండల కేంద్రం నడిబొడ్డులో నిర్వహించే ఈ సంతకు ప్రతీ వారం వేలాది మంది తరలి వచ్చి, తమకు ఇష్టమైన సరుకులు కొనుగోలు చేసుకొని వెళ్తుంటారు. తమ పిల్లాపాపలతో తరలివచ్చి బంధువుల ముచ్చట్లతో మురిసిపోయే సంతలో సమస్యలే దర్శనం ఇస్తున్నాయి. అదూ నవాబ్‌పేట ఆదివారం సంత విశేషాలు..

మండలంలోని వివిధ గ్రామాలతో పాటు బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, కొందుర్గు, చౌదరిగూడ, కుల్కచెర్ల, చౌడాపూర్, మహ్మదాబాద్, మహబూబ్ నగర్, హన్వాడ తదితర మండలాల నుంచి సుమారు వేలాది మంది సంతకు వచ్చి సరుకులు కొనుగోలు చేస్తుంటారు. చిన్న వస్తువు నుంచి పెద్ద వస్తువు దాక అన్నీ ఇక్కడ దొరకడం ఈ సంత ప్రత్యేకం. కొండాపూర్ చౌరస్తా నుంచి లోకిరేవు రహదారి, పాత గ్రామ పంచాయతీ వరకు అనేక వస్తువులు విక్రయిస్తుంటారు.

● దండిగా ఆదాయం : ఇంత ప్రత్యేకత ఉన్న ఈ సంతకు ఆదాయం కూడా భారీగా ఉంటుంది. ఏడాదికోసారి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తుండడంతో లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. సంతకు వచ్చే ప్రజలకు వసతులు అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. సంతలో తాగునీటికి ఇబ్బంది ఉందని క్రయ విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. దుర్వాసన వెదజల్లుతున్న మోరీలు.. సరుకులు విక్రయించిన తర్వాత కుళ్లిన కూరగాయలు అక్కడే వదిలి వేయడంతో మురికి కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. సంతకు వచ్చే వారికి మౌలిక వసతులు కల్పించకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంతలో దొంగల చేతివాటి తక్కువేం కాదు. ఫోన్‌లు, నగదు, ఇతర విలువైన నగలు అపహరిస్తున్నట్లు సమాచారం. చికెన్, మటన్ విక్రయానికి ప్రత్యేక మార్కెట్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆదివారం వచ్చిందంటే నవాబ్‌పేటలో ట్రాఫిక్ సమస్య గంటల తరబడి ఉంటుంది. మహబూబ్ నగర్-నవాబ్‌పేట, షాద్‌నగర్-పర్గి తదితర ప్రాంతాలకు బారీ వాహనాలతో పాటు చిన్న పెద్ద వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదురతున్నాయి. వీధి కుక్కల బెడద సైతం పొంచి ఉంది.

ప్రత్యేక స్థలం కేటాయించాలి



నిత్యం అభివృద్ధి చెందుతున్న నవాబ్‌పేటలో సంతకు కూడా ప్రతేక ప్రాధాన్యత ఉంది. సంతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడంతో పాటు మౌళిక వసతులు కల్పిస్తే చాలా సౌకర్యాలు మెరుగౌతాయి. సంతకు వచ్చే ప్రజలకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయాలి.

- నర్సింహ, నవాబ్‌పేట

ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాం



ఆదివారం సంతకు చాలా మంది ఇక్కడకు క్రయ విక్రయాలు జరుపుతారు. యన్మనగండ్ల నవాబ్‌పేట రహదారి అభివృద్ధి చేసి మటన్ చికెన్, చేపల మార్కెట్ స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తాం. సంతకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు

- సత్యం, నవాబ్‌పేట

చర్యలు తీసుకుంటాం

సంతలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇక్కడ మౌలిక వసతుల ఏర్పాటుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అవి రాగానే పనులు మొదలు పెడతాం. కొన్ని అనుమతులు, కొన్ని నిధులు రావాల్సి ఉంది. సిబ్బంది కొరత ఉంది. అందువల్లే కొన్ని పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారు. సిబ్బందిని నియమించుకుంటాం.

- నరేష్ గౌడ్, కార్యదర్శి

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, మే 19 : మహబూబ్‌నగర్ పట్టణంలో సోమవారం 20వ తేదీన 11కేవీ న్యూటౌన్ ఫీడర్ నిర్వహణ, మరమ్మతు చేపడుతుండటంతో తాత్కాలిక విద్యుత్ కోత విధిస్తున్నట్లు సెక్షన్-3 ఏఈ భగవంతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతహోటల్ ఏరియా, బాయమ్మతోట, న్యూటౌన్, రాజేంద్రనగర్, కవిత నర్సింగ్‌హోం, షాషాబ్‌గుట్ట మసీదు ఏరియా, హింది పండిట్ కాలేజ్ ఏరియా, బీఐపీ కాంప్లెక్స్, తండా ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు విద్యుత్‌కోత విధిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు

హన్వాడ, మే 19 : రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందచేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. మండల రైతులకు సరిపడే విత్తనాలు పర్టిలైజర్ షాప్‌ల్లో ఉన్నాయని అవసరం ఉన్న రైతులు తీసుకోవాలని కోరారు. క్వింటాల్‌కు 9300 రుపాయలు ఉండగా సబ్సిడీ 5580 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక హెక్టర్‌కు 30 కిలోల పచ్చి రొట్ట (జిలుగ)విత్తనాలు వేయాలని చెప్పారు. కనీసం 40 రోజులు ముందు వేసుకుంటే సాగు చేసే పంటకు లాభం ఉంటుదాని తెలిపారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 19 : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న కబడ్డీ, బాస్కెట్‌బాల్ శిబిరాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, కోచ్‌ల సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. కబడ్డీ, బాస్కెట్ బాల్‌లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తి గౌడ్, కోచ్‌లు ఖలీల్, నాయకులు పాపారాయుడు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు



బాధిత కుటుంబ సభ్యులకు డిపాజిట్ కాపీలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరకద్ర, మే 19 : దేవరకద్ర మండల పరిధిలోని గద్దెగూడెంకు చెందిన 1997-98 దేవరకద్ర పాఠశాల పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి చెన్నరాముడు గత సంవత్సరం డిసెంబరులో అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో తోటి మిత్రులు చెన్నరాముడు సంతానమైన ఇద్దరు ఆడపిల్లలకు ప్రధాన మంత్రి సుకన్యయోజన పథకం ద్వారా లబ్ధిపొందేందుకుగాను ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున పోస్టాఫీసులో డిపాజిట్ చేసి ఆదివారం గద్దెగూడెంలో బాధిత కుటుంబ సభ్యులకు డిపాజిట్ కాపీలను అందజేశారు. స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేసిన సహాయానికి గ్రామస్థులు అభినందించారు. అదేవిధంగా చిన్నరాజమూరులో బుడగజంగం చంద్రమ్మ చనిపోవడంతో ఆమె అంత్యక్రియలకు జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు రూ.5000 ఆర్థికసాయం అందజేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

- ఆస్పత్రికి తరలింపు



గాయాలైన శివుడు

మిడ్జిల్, మే 19 : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు శివుడు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడినట్లు ఆదివారం గ్రామస్థులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య వ్యవసాయ పొలం వద్ద సర్వీస్ వైరు కాలిపోతే, గ్రామంలో చిన్న చిన్న మరమ్మతులు చేసే శివుడిని మరమ్మతు చేసేందుకు తీసుకెళ్లా రు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేసి స్తంభం ఎక్కగా, అదే స్తంభంపై మరో విద్యుత్ 11 కేవీ లైన్‌కు లైన్‌క్లియర్ తీసుకోకపోవడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. వెంటనే శివుడిని చికిత్స నిమిత్తం జడ్చర్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భార్యాభర్తలు గొడవ పడి భర్త ఆత్మహత్య



మల్లేష్ నాయక్ (ఫైల్)

భూత్పూర్, మే 19 : భార్య, భర్తలు ఇద్దరు చిన్నపాటి గొడవ పడి క్షణికావేశంలో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్ద తండా గ్రామ పంచాయతీ పరిధిలోని భగవాన్ తండాకు చెందిన కేతావత్ మల్లేష్ నాయక్ (26)కు గతేడాది క్రితం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ తండాకు చెందిన శిరీషతో వివాహం అయ్యింది. భార్యాభర్తలిద్దరూ బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. వారిద్దరు తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన శిరీష, భర్తతో గొడవపడి హైదరాబాద్ నుంచి పుట్టినింటికి వచ్చింది. భార్య ఎక్కడికి వెళ్లిందని భర్త మల్లేష్‌నాయక్ వెతుక్కుంటూ అత్తగారి తండా అయిన ఆవంచకు వచ్చాడు. అక్కడ ఏమి గొడవ జరిగిందో తెలియదు. మల్లేష్ నాయక్ ఆదివారం తెల్లవారుఝామున భగవాన్‌తండా సమీపంలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన మృతుని కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతుడి తండ్రి తావుర్యా నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టులో 3.617 టీఎంసీల నీరు నిల్వ



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి చేరుతున్న వరద

అమరచింత, మే19: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 2596 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ప్రాజెక్టుకు చేరింది. దీంతో జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్, సమాంతర కాలువల వద్ద భారీగా నీరు చేరుతోంది. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసిన విషయం తెలిసింది. దీంతో పూర్తిగా ఒట్టిపోయిన కృష్ణానది నేలను వరద నీటితో తడుపుతూ ముందుకు సాగి భారీస్థాయిలో జూరాల ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 3.617 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ కన్నా రెట్టింపు నీరు అంటే 2596 క్యూసెక్కుల నీరు అదనంగా జూరాల ప్రాజెక్టుకు చేరింది. నారాయణపూర్ నుంచి మరికొన్ని గంటలు నీరు ప్రాజెక్టుకు వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా ఈ ప్రాంతంలో ఏర్పడిన తాగునీటి ఇబ్బందుల నుంచి ఆయా గ్రామాల ప్రజలు గట్టెక్కినట్లు అయింది. మరో పది రోజుల పాటు వరద ఇలాగే కొనసాగితే చంద్రఘడ్ లిఫ్ట్ ద్వారా ఖరీఫ్ సాగు రైతులకు సాగునీరు వదిలే అవకాశం ఉంది. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి ఇప్పటికే సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా కొనసాగుతుంది. తాగునీటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తు న్నారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ నుంచి వరద కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారులు బీచుపల్లి ఆంజనే యులు తెలిపారు.

అలంపూర్ ఆలయాల్లో విద్యాశాఖ అధికారుల పూజలు



అలంపూర్‌లో పూజల అనంతరం విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు యాదగిరి, రాజేందర్‌సింగ్

అలంపూర్, మే 19 : ఐదవ శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వరస్వామి వార్లను విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు యాదగిరి, రాజేందర్‌సింగ్‌లతో పాటు, తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ దర్శించుకున్నారు. ఆదివారం అలంపూర్‌కు చేరుకున్న వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువాతో సత్కరించారు. వీరి వెంట ఆలయ ఈవో పురందర్‌కుమార్, అర్చకులు, అలంపూర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ కృష్ణమూర్తిలు ఉన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మల్లేష్‌గౌడ్ (ఫైల్)

వెల్దండ, మే 19 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన కేశమోని మల్లేష్‌గౌడ్ (36) ఆదివారం తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే... గత కొంతకాలంగా మానసికస్థితి సరిగ్గాలేని మల్లేష్‌గౌడ్ అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

నిషేధిత బెల్లం విక్రయిస్తే పీడీయాక్ట్ అమలు

- శిబిరంలో నల్లబెల్లం పట్టివేత - కేసు నమోదు: సీఐ

లింగాల, మే 19 : నిషేధిత సారాకు ఉపయోగపడే బెల్లం విక్రయిస్తే చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తూ కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం స్టేట్ టాస్క్‌ఫోర్సు హైదరాబాద్ బీటీమ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున రూట్‌వాచ్ నిర్వహించారు. ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం శాయిన్‌పేట గ్రామంలో 209బస్తాలు అంటే 6270 కిలోల నల్లబెల్లంతో పాటు ఒక డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి బెల్లం తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో దారి కాచి పట్టుకుని డీసీఎంతో సహా బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూలూరి ప్రసాద్, వెంకటస్వామిలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సారా తయారీకి వాడే బెల్లం వ్యాపారాలు నిర్వహించిన సారా తయారు చేసి క్రయ విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలకపల్లి ఎక్సైజ్ ఎస్ఐ జనార్దన్, ఎస్ఐ బలరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ, మే 19: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జకినాలపల్లి గ్రామానికి చెందిన పోలె రామచంద్రయ్య (57) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి భార్య వెంకటమ్మ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలి డబ్బులు మద్యం సేవించడానికి ఇవ్వాలని నిత్యం వేధించేవాడని అన్నారు. ఈ నెల 17న మద్యం సేవించి భార్యతో గొడవ పడి వ్యవసాయ పొలంలోకి వెళ్లాడని తెలిపారు. అక్కడ ఉన్న పురుగులమందు తాగి ఇంటికి వచ్చి ఇంటి ఆవరణలో పడిపోగా కుటుంబ సభ్యులు గుర్తించి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు పోలె సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగించామని ఏఎస్ఐ పేర్కొన్నారు.

పరమశివునికి రుద్రాభిషేకం

కందనూలు, మే 19 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ పాత రవి తేజ కాలేజ్ వెనక గల శ్రీపబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో క్రోధినామ సంవత్సరం వైశాఖ ఏకాదశి సందర్భంగా ఆదివారం పరమశివునికి భక్తులచే పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో, ఏక పారాయణ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు అజయ్‌కుమార్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదమంత్రోచ్చారణల మధ్య భక్తి పూర్వకంగా పరమశివుని పూజించడంతో ఆయుస్సు ఐశ్వర్య అభివృద్ధి సిద్ధిస్తాయని అన్నారు. భక్తులు పరమశివునికి పంచామృత, విభూతి, సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు, బిల్వపత్రాలతో రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపంచాయతనంలో ఉన్న గణపతి అమ్మవారు సూర్యభగవాన్ విష్ణుమూర్తి జంట నాగుల స్వాములకు కూడా ప్రత్యేకంగా అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో స్వామి వారికి అష్టోత్తరంతో అర్చనలు చేశారు. భక్తులకు అభిషేక పంచామృత తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అర్చకులు కందాడై శ్రీనివాసాచార్యులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మాణమేదీ?

- ఆరునెలలుగా నిలిచిన నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- వాహన రాకపోకలకు తీవ్ర అసౌకర్యం

ఉండవల్లి, మే 19 : గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో ప్రధాన రోడ్డుపై ఉన్న వాగుతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆశించిన గ్రామస్థుల ఆశలు అడియాశలుగా మిగిలాయి. పనులు ఆగుతూ, కొనసాగుతుండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

గ్రామంలోని ప్రధాన రోడ్డులో పెద్దవాగు ఉండడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు నుంచి అలంపూర్ ఆలయాల దర్శనానికి ఇదే దారిలో వాహన రాకపోకలు సాగుతున్నాయి. వర్షాకాలంలో వర్షపునీరు రోడ్డుకు సమాంతరంగా పారుతుండడంతో ప్రయాణానికి ఆటంకంగా ఉండేది. గ్రామస్థుల వినతి మేరకు గత ప్రభుత్వంలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలతో అనుమతులు వచ్చాయి. నాటి ఎమ్మెల్యే అబ్రహం చేతులమీదుగా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. నిర్మాణ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ గత సంవత్సరం జనవరి నెలలో పనులు ప్రారంభించారు. నాటి నుంచి నేటివరకు బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతూ ప్రస్తుతం ఐదు నెలలకు పైగా పూర్తిగా పనులు ఆగిపోయాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి తమ ఇబ్బందులు తొలుగుతాయని అనుకున్న గ్రామస్థులు పనుల ఆలస్యంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పనులు నిదానంగా జరగడంతో కర్నూలు, బస్వాపురం నుంచి అలంపూర్, ఉండవల్లి మండలాలకు వచ్చే వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే గ్రామంలోని ప్రధాన రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని దీనికి తోడు బ్రిడ్జి పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని బైరాపురం, బస్వాపురం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులను జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా గ్రామం మీదుగా కర్నూలు, అలంపూర్‌తో పాటు పలు గ్రామాలకు వందల సంఖ్యలో వాహన రాకపోకలు సాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉంది. బ్రిడ్జి పనులు నిలిపివేయడంతో వాహన దారులు ఇరుకు సందుల్లో ప్రయాణాలు కొనసాగిస్తు న్నారు. దీంతో రోడ్డు మొత్తం ధ్వంసం అవుతోంది. బ్రిడ్జి పనులతో ప్రారంభించడంతో పాటు, గ్రామంలో ప్రధాన రోడ్డుపై మరమ్మతులు చేపట్టాలి.

- మద్దిలేటి, బైరాపురం గ్రామస్థుడు

గడువులోగా పూర్తి చేయిస్తాం..

బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోవడం నిజమే. అయితే సదరు బ్రిడ్జి నిర్మాణం గడువు ఈ సంవత్సరం సెప్టెంబరు వరకు ఉంది. గడువులోగా పనులు పూర్తి చేయిస్తాం. ఎన్నికలు జరగడం, బిల్లుల మంజూరు ఆలస్యం కావడం కూడా కొంత జాప్యానికి కారణం. గడువులోగా నిర్మాణం చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- మహేష్, ఏఈ, ఆర్అండ్‌బీ



అర్థాంతరంగా ఆగిపోయిన బైరాపురంలోని బ్రిడ్జి నిర్మాణం



ఇరుకు సందులో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

నేల బ్రిడ్జిలతో అవస్థలు

మానవపాడు, మే 19 : వర్షాకాలం మొదలవుతుందంటేనే మానవపాడు మండలంలోని గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకల కోసం ప్రత్యామ్నాయం వెతుకుతుంటారు. ఈ మండలంలోని గ్రామాలకు వెళ్లాలంటే నేలబ్రిడ్జిలే దిక్కు. మండల కేంద్రంతో పాటు ఇతర పట్టణాలకు వెళ్లాలంటే గ్రామాల ప్రజలు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో వర్షం కురిస్తే పంట పొలాల్లోని నీరు వాగుల వెంట పారి నేలబ్రిడ్జిలపైకి చేరుకొని వరదగా మారుతోంది. ముఖ్యంగా మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్యలోని వాగు వంతెన కిందకి ఉండడంతో వరద ఎక్కువై ఇరుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు చదువుకునేందుకు వెళ్లిన నారాయణపురం, పెద్దఆముదాలపాడు, అమరవాయి గ్రామాల విద్యార్థులు, గ్రామస్థులు చివరకు మండల కేంద్రంలోనే ఉండాల్సి వస్తోంది. కొందరు ప్రమాదమని తెలిసినా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా మానవపాడు నుంచి చెన్నిపాడు, గోకులపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలకు వెళ్లే దారుల్లో మూడు చోట్ల నేలబ్రిడ్జిలు ఉన్నాయి. గత ఏడాది క్రితం చెన్నిపాడు బండల వాగులో ఓ బైక్ కొటుకుపోయింది. పెద్దపోతులపాడు-చెన్నిపాడు మధ్యలో బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం కురిసిన చిన్నపాటి వర్షానికే ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గోకులపాడులో బ్రిడ్జి ఉన్నప్పటికి దానిపై గుంతలు ఏర్పడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత రెండేళ్ల క్రితం భారీగా వర్షాలు కురవడంతో బోరవెల్లి, పల్లెపాడు గ్రామాలకు వెళ్లే దారిలోని వంతెనపై వరదనీరు పట్టక రోడ్లు తెగిపోయాయి. ప్రస్తుతం రాకపోకలకు అంతరాయం కలుగకుండా పనులు చేసి వదిలేశారు. వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటే గ్రామాల ప్రజలు, విద్యార్థులు అవస్థలకు గురికావల్సిందే.



మానవపాడు- అమరవాయి గ్రామాల మధ్యలోని వాగు వంతెన

ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు

వర్షాకాలంలో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి. గ్రామాల మీదుగా వాహనాలు నడుపుతు పోతుంటాం. నేలబ్రిడ్జిలు ఎక్కడ ఎంత లోతులో ఉంటాయో తెలియదు. కనీసం సూచికలు లేవు. రాత్రివేళల్లో వాహనాలు బోల్తా పడుతున్నాయి.

- మాలిక్, ఆటో డ్రైవర్

ప్రతిపాదనలు పంపించాం

నేలబ్రిడ్జిలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిసి వంతెనల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. ముఖ్యమైన చోట్ల బ్రిడ్జిలు ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

- మహేష్, ఏఈ, ఆర్అండ్‌బీ

నేటి నుంచి సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- నాలుగురోజుల ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి
- చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు

తాడూరు, మే 19 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి 24 వరకు ఐదురోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఇందుకు సం బంధించి గ్రామ పెద్దలు ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం సుప్రభాతం, మండపారాధన, గణపతిపూజ, ధ్వజారోహణం, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. 21న మంగళవారం మహాకుంభాభిషేకం, శిఖర సంప్రోక్షణ, సామూహిక గీతాయజ్ఞం పూర్తైన అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలను అందజేస్తారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ ఘట్టంలో ప్రధానమైన ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. 22న స్వామి వారికి అభిషేకం అనంతరం, సుదర్శన హోమం, 11:30గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణ నిర్వహించనున్నారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందజేయడంతో పాటు సాయంత్రం స్వామి అమ్మవార్ల విగ్రహాలతో గ్రామంలో పల్లకి సేవ చేయనున్నారు. 23న తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించడంతో పాటు సాయంత్రం ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షిణలు చేయనున్నారు. 24న స్వామి అమ్మవార్లకు చక్రస్నానం చేయించడంతో పాటు బోనాల సమర్పణ చేయనున్నామని ఆలయ ప్రధాన అర్చకుడు జగదీశ్వర్ తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా పూర్తి చేసేందు కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు గున్న రమేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు తెలిపారు.



సిర్సవాడలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

మాగనూరు, మే 19 : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కర్ణాటకలోని పెద్ద సంబురం గ్రామ సమీపంలోని చెరువు కట్టపై చోటు చేసుకోగా నారాయణపేట జిల్లా మాగనూరు మండలం నేరడుగం గ్రామానికి చెందిన బోయ బస్వ లింగప్ప (25) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బోయ బస్వ లింగప్ప కర్ణాటక రాష్ట్రం గుర్మిటికల్ తాలుకా కనెకల్ గ్రామంలో శనివారం పొలం దున్నేందుకు వెళ్లాడు. పని ముగించుకొని రాత్రి స్వగ్రామమైన నేరేడుగం గ్రామానికి వస్తున్న సమయంలో కర్ణాటకలోని పెద్ద సంబురం గ్రామ చెరువు కట్టపై ట్రాక్టర్‌పై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే బోయ బస్వ లింగప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో రెండు సంవత్సరాల కూతురు ఉంది.

యువకుడిపై దాడి, కేసు నమోదు

గద్వాల క్రైం, మే 19 : మద్యం మత్తులో ముగ్గురు యువకులు కలిసి ఓ యువకుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై కర్నూల్‌కు తరలించిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి ఎస్సై శ్రీనివాస్, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని చింతలపేట కాలనీకి చెందిన తిరుమలేష్ అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా అదే కాలనీకి చెందిన సీసీ యూత్ సభ్యులైన చిన్న, హరి, వెంకటేష్ అనే యువకులు అడ్డగించారు. నీ తమ్ముడు స్వామి బైక్ అజాగ్రత్తగా నడిపాడని, అతను ఎక్కడ ఉన్నాడని మద్యం మత్తులో ఉన్న ముగ్గురు తిరుమలేష్‌ను దుర్భాషలాడుతూ విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిలో తిరుమలేష్ కన్ను పూర్తిగా పోయింది. వెంటనే మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

పంచ్ పడితే ప్రత్యర్థి చిత్తే

- కరాటేలో రాణిస్తున్న సాన్వి



ఇటీవలే మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పతకం అందుకుంటున్న సాన్వి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 19 : ఆ అమ్మాయి పంచ్‌పడితే ప్రత్యర్థి చిత్తు కావాల్సిందే.. కోర్టులో దిగితే పతకం ఖాతాలో చేరాల్సిందే.. మార్షల్ ఆర్ట్స్‌లో మెరుస్తూ మెడల్స్‌నూ కొల్లగొడు తున్నది. యుద్ధక్రీడలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌కు చెందిన ఆలంపల్లి సంతోష్‌కుమార్, బ్రాహ్మణి దంపతుల కూతురు సాన్విచంద్రకు చిన్నప్పటి నుంచి కరాటే అంటే మక్కువ. ఆరవ తరగతి చదువుతున్న ఆమె ఆరేడేళ్ల నుంచి కరాటే మాస్టర్ శామ్యూల్ వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అనేక విజయాలు నమోదు చేసుకున్నది.

సాధించిన పతకాలు

- ఇటీవలే మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో కటాస్‌లో బంగారు, కుమితేలో కాంస్య పతకం
- 2023లో సింగపూర్, మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో రెండు బంగారు పతకాలు
- 2022లో బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో 1 బంగారు, 1 వెండి పతకాలు సాధించింది.
- ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో 9 మెడల్స్ జాతీయస్థాయిలో 18 మెడల్స్ సాధించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...

మా నాన్న ఎంతో ఇష్టంతో చిన్నప్పుడే నన్ను కరాటే శిక్షణలో చేర్పించారు. మాస్టర్ శామ్యూల్ నేర్పిన మెళకువలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి దేశప్రతిష్ఠను పెంచాలన్నదే నా లక్ష్యం.

- సాన్వి, కరాటే చాంపియన్



2022లో బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించిన సాన్వి

బండలాగుడు పోటీల్లో విజేత నాగర్‌కర్నూల్ జిల్లా



బహుమతి దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాన్‌గల్, మే 19: మండల పరిధిలోని మహమ్మదాపూర్ గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరుకు చెందిన టీసీఆర్ బుల్స్ అఖిలేష్ రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. విజేతగా నిలిచిన యజమానికి రూ. 60వేల నగదు బహుమతి నిర్వాహకులు అందజేశారు. నంద్యాల జిల్లా గున్నన్‌దిన్నె గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎద్దులు ద్వితీయ స్థానం సాధించడంతో యజమానికి రూ. 50వేల నగ దు బహుమతిని, గుంటూరు జిల్లా కుందెనప ల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ఎద్దులు మూడవ బహుమతి సాధించడంతో యజమానికి రూ. 40వేల నగదును, నం ద్యాల జిల్లా పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన నాగయ్యకు చెందిన ఎద్దులు నాల్గవ స్థానం సాధించడంతో రూ. 30వేల నగదును యజ మానికి నిర్వాహకులు అందజేశారు. కర్నూలు జిల్లా వల్కూరు గ్రామానికి చెందిన దొడ్డికాడి తిరుమలేష్‌కు చెందిన ఎద్దులు అయిదవ బహుమతి సాధించగా యజమానికి రూ. 20వేల నగదు, వనపర్తి జిల్లా పెద్ద దగడ గ్రామానికి చెందిన గోపాలకృష్ణకు చెందిన రాజులు ఆరవ బహుమతి సాధించడంతో యజమానికి రూ. 10వేల నగదును నిర్వాహకులు అందజేశారు.

వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు, కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌కు, సాగర్‌తో పాటు పలువురు నాయకులను నిర్వాహకులు సన్మానించారు. పోటీల్లో వ్యాఖ్యతగా రెహమాన్ వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ ముంత భాస్కర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సతీష్ భార్యకు బీమా చెక్కును అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్,మే19: బీఆర్‌ఎస్ కార్యకర్తలే నా కుటుంబ సభ్యులని, వారి శ్రేయస్సుకే తాను ప్రాధాన్యం ఇస్తానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోని కాశీంనగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సతీష్ భార్య భానుశ్రీకి రూ. రెండు లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతీష్ కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, గొర్రెల పెంపకందారుల మాజీ అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, సింగిల్ విండో ప్రెసిడెంట్ రఘువర్ధన్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నరేష్, దేవర్ల నరసింహ, జాత్రూ నాయక్, సంపత్ కుమార్, శంకర్ బి.నాయక్, కురుమూర్తి, చిట్యాల రాము, నాయకులు రాము, మహేష్, తిరుపతి, మోతిలాల్, గోవిందు, చందు నాయక్, నరసింహ , వెంకటయ్య, నీలేష్, నానునాయక్ పాల్గొన్నారు.

ప్రజా సేవలో కొనసాగాలి

- గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం కురుమూర్తి యాదవ్



మోహన్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

వనపర్తి టౌన్, మే 19: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉంటూనే ప్రజలకు న్యాయ సలహాలు అందిస్తూ ప్రజా సేవలో నిత్యం కొనసాగాలని గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం కురుమూర్తి యాదవ్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన మోహన్ కుమార్ యాదవ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని గొర్రెల కాపరుల సంఘం కార్యాలయంలో జిల్లా యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం ఉపాధ్యక్షుడు చంద్రయ్య యాదవ్, డైరెక్టర్లు నాగేంద్రం యాదవ్, రాంచంద్రయ్య యాదవ్, దేవేందర్ యాదవ్, కుర్వ రాజేష్, పరశురాం యాదవ్, మునిసిపల్ కౌన్సిలర్ పెండెం నాగన్న యాదవ్, అజ్జకొల్లు నర్సింహ పాల్గొన్నారు.

వ్యాయామం, యోగాతో ఆత్మవిశ్వాసం



చిన్నారులతో బాడ్మింటన్ క్రీడాకారిణి స్వాతి, అల్లూరి శ్రీనివాస్ చౌదరి

కొత్తకోట, మే 19 : బాలబాలికలు ప్రతీరోజు వ్యాయామం, యోగా చేస్తే ఆత్మ విశ్వాసం పెరుగుతుందని తమిళనాడు రాష్ట్రానికి చెందిన బాడ్మింటన్ క్రీడాకారిణి స్వాతి అన్నారు. మండలంలోని నాటవెళ్లి గ్రామ శివారులోని విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఫిట్‌నెస్ టెక్నిక్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ బాలబాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించేందుకు మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. బాలబాలికలు సైతం చదువుతో పాటు వ్యాయమం, యోగా ఆసనాలు చేస్తుండాలన్నారు. మన ముందు జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను ఎదిరించి, మంచి పౌరులుగా పెరుగాలంటే చిన్నప్పటి నుంచి ఓ లక్ష్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అల్లూరి శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణను కలిసిన స్థానిక నాయకులు



డీకే అరుణకు మద్దతు తెలుపుతున్న అమరచింత నాయకులు

అమరచింత, మే 19: బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను ఆదివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో డీకే అరుణను బీజేపీ మండల రూరల్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కార్యకర్తలు పని చేసిన తీరు, బూత్ స్థాయి నాయకుల పనితీరు, ఓటింగ్ సరళి తదితర అంశాలపై చర్చించారు. అన్ని వైపుల నుంచి వస్తున్న సమాచారం మేరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయం తథ్యమని నాయకులు ముందస్తు శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిసింది. కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు హరీశ్, మల్లారెడ్డి, ఉప సర్పంచ్ ఆనంద్, మన్నెపు రెడ్డి, సురేందర్, శ్రీకాంత్, వెంకట్ రాములు, నరేష్, జనార్దన్, మల్లెపు రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఖత్నా క్యాంపు విజయవంతం



క్యాంపులో పాల్గొన్న ట్రస్టు అధ్యక్షుడు హఫీజ్ , సభ్యులు

కొత్తకోట, మే 19 : పట్టణంలోని అమీన్ - ఉల్ - మిస్కీన్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యూ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఖత్నా (సున్తీ) క్యాంపు విజయవంతమైంది. ట్రస్టు అధ్యక్షుడు ఎంఎ. హఫీజ్ మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా అమీన్ ఉల్ మిస్కీన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖత్నా క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. క్యాంపులో డాక్టర్లు తౌఫిక్ ఇమామ్, మహమ్మద్ ముజీబ్ 120 మంది పిల్లలకు సున్తీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ గ ఫార్, ఫయాజ్ అలీ, జావిద్‌అలీ, మౌలానా ఖాజి షఫీ, హఫిజ్‌కమల్ రెహమాన్, ఖాద్రియ మౌలాన సలాం, షబ్బీర్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రహీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏజాజ్ అలీ, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు ఖదీర్ ఖాన్ ముజీబ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముంపు గ్రామస్థుల దీక్ష

రేవల్లి, మే19: మండలంలోని బండరాయిపాకుల గ్రామంలో ముంపు గ్రామస్థులు పునరావాసం డబ్బులు , ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న దీక్ష 94వ రోజుకు చేరుకుంది . ఆదివారం దీక్షలో పాల్గొన్న ముంపు గ్రామస్థుడు సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు ఇన్ని రోజులు దీక్ష చేస్తున్న ఎవరూ పట్టించుకోవడం వారు తమకు న్యాయం చేస్తున్నట్లుగా మేము భావించడం లేదని ఎన్ని రోజులైనా సరే న్యాయం జరిగే వరకూ దీక్ష ఆపమని తెలిపారు.

వాహనాలకు తుప్పు.. ఎవరిది తప్పు?

- పీహెచ్‌సీ వెనుక నాలుగు 104 వాహనాల నిలిపివేత

- సంరక్షణ పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

పెద్దమందడి, మే 19: 104 వైద్య సేవలతో గర్భిణులు, వృద్ధులు, అధిక రక్తపోటు తదితర రోగాలతో ఇబ్బందులు పడే వారికి ఊరట లభించేది. పట్టణాలకు వెళ్లకుండా పల్లెల్లో వైద్య సేవలందడంలో సమయం, డబ్బు ఆదా అయ్యేది. 104 వైద్య సిబ్బంది తెలియజేసే విలువైన సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడేది. అయితే గత ప్రభుత్వం పల్లెవాసుల ప్రాణాల పాలిట సంజీవినిగా పేరొందిన 104 సేవలను నిలిపివేయడంతో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలకు తీసుకెళ్లే వారు లేక అవస్థలు పడుతూ స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం

రెండేళ్ల క్రితం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 104 సేవలను నిలిపివేసింది. దాంతో వాహనాలు వృథాగా నిలిపివేయాల్సి వచ్చింది. వాటిని ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

- జయచంద్ర మోహన్,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్య సేవలను అందించిన 104 సంచార వాహనాలు మూలకు చేరాయి. రెండేళ్లుగా వాటి సేవలు నిలిచిపోవడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇతర కార్యాలయాల్లో తుప్పుపడుతున్నాయి. అధికారులు వాటి సంరక్షణ గురించి పట్టించుకోవడం లేదు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ వాహనాలు ఎందుకూ పనికి రాకుండా తయారవుతున్న పట్టించుకోవడం లేదు. సరైన వైద్య సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాలకు వైద్యులు, సిబ్బంది మందులను తరలించి చికిత్సలు అందించేలా 2008లో అప్పటి ప్రభుత్వం సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పైలెట్ ప్రాజెక్టు కింద నాగర్‌కర్నూల్ ప్రాంతంలో శ్రీకారం చుట్టారు. ఈ వాహనంలో వైద్యుడు, ట్యాబ్ టెక్నీషియన్, ఏఎన్‌ఎం, ఆశ ఇతర సిబ్బంది ఉండేవారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022, మే నుంచి 104 వైద్య సేవలను నిలిపి వేసింది. దీంతో అందులో పని చేస్తున్న సిబ్బందిని ఇతర ప్రాంతాల్లో ట్యాబ్‌టెక్నీషియన్లుగా ఆసుపత్రులకు బదలాయించారు. వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేశారు. అప్పటి నుంచి 104 వాహనాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారు పర్యవేక్షణ పూర్తిగా ఆటకెక్కింది.



పెద్దమందడి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నిలిపిన 104 వాహనాలు

వాటిని వనపర్తి జిల్లాకు కేటాయించిన నాలుగు వాహనాలు పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టి పోతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో ఇతర సేవలకు వినియోగించే ఏ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఏ వాహనాలు దెబ్బతినే ప్రమాదం తప్పేది. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని తిరిగి ఇప్పుడున్న కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ 104 సేవలను అందుబాటులో తీసుకువచ్చి మారుమూల ప్రాంతాల్లో ఉన్న వృద్ధులకు, బాలింతలకు, గర్భిణులకు దీర్ఘకాలిక రోగులకు కావాల్సిన సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా బీరప్ప, చౌడేశ్వరి మాత ఉత్సవాలు

ఖిల్లాఘణపురం, మే 19: మండలంలోని మానాజీపేట గ్రామంలో ఆదివారం కురువ, గొల్లల కులస్తులు బీరప్ప చౌడేశ్వరి మాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కురువ కులస్తులు బీరప్ప దేవుడికి , గొల్ల కులస్తులు చౌడేశ్వరి మాత అమ్మ వారిని అందంగా అలంకరించిన బోనాలతో , గంపలలో పొలిని నైవేద్యంగా సమర్పించారు. మహిళలు ప్రత్యేక సంప్రదాయ దుస్తులు ధరించి తలపై బోనాలు , గంపలతో డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుతో ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తు చిన్న పెద్ద సందడి చేశారు. మొక్కులు సమర్పించడానికి భక్తులు పోటెత్తారు. ఎస్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



మానాజీపేటలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి

మానాజీపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీరప్ప చౌడేశ్వరి మాత ఉత్సవాల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పల్లెల్లో ప్రజల ఆదాయ మార్గాలు పెరిగి సుఖ సంతోషాలతో పండుగలు నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామాల్లోని పండుగల వల్ల ప్రజల్లో భక్తి భావాలు పెరిగి ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆయా ఆలయ కమిటీలను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు నాగన్న యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, వెంకట్ నారాయణ రెడ్డి, శివన్న, సుక్కన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను వినియోగించుకోవాలి: ఏవో



విలేకరులతో మాట్లాడుతున్న ఏవో డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల, మే 19 పంట వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన ప్రాంతంలో ప్రధాన పంటలైన వరి కొయ్యలను అంటించడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. భూమిలోని పోషకాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. వరిగడ్డి తగలపెట్టం వల్ల 5.5 కేజీల నత్రజని, 2.3 కేజీల బాస్వరం, 25కేజీల పోటాషియం, 400 కేజీల సేంద్రియ ఎరువులను కోల్పోతామని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూమి సారం పెరుగుతుందన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



సగం కూలిన దిమ్మెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

రేవల్లి, మే19: మండలంలోని కేశంపేట గ్రామంలో ప్రజల సౌకర్యార్థం విద్యుత్ కోసం ఏర్పాటు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కింది భాగం ఒకవైపు కూలి ప్రమాదకరంగా ఉంది. గత సంవత్సర కాలం నుంచి ఇలాగే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, విద్యుత్ అధికారులకు కూడా తెలిపామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను సరిగా నిర్మించాలని లేదంటే మరో చోట దిమ్మె ఏర్పాటు చేసి అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈదురుగాలులకు ఎప్పుడైనా దిమ్మె కూలిపోవచ్చని, వీలైనంత త్వరగా దిమ్మెను సరి చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడి మృతి

చిన్నంబావి మే 19: మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. కాంగ్రెస్ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, మందడి చిదంబర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతి దేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, గజ్జి ఈదన్న యాదవ్, డైరెక్టర్ వెంకటస్వామి, ఆర్ రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో రాజకీయాలు కొనసాగాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

వనపర్తి టౌన్, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో నూతన రాజకీయాలు కొనసాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో జన్మించిన సుందరరాంరెడ్డి తన పేరును పుచ్చలపల్లి సుందరయ్యగా మార్చుకున్న మేధావి అని, తన గ్రామంలో కుల వివక్ష లేకుండా చేయడం కోసం సపంక్తి భోజనాలు పెట్టించేందుకు కృషి చేశాడని అన్నారు. పేద ప్రజలే తన కుటుంబం అని భావించిన పుచ్చలపల్లి సుందరయ్య, లీలా దంపతులు తమ భూమిని పేదలకు పంచిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, లక్ష్మి, కృష్ణయ్య, దేవేందర్, ఉమా, సాయిలీల, సువర్ణ, కవిత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింతలలో..

అమరచింత: సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం అమరచింతలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బి.వెంకటేష్, ఆర్.ఎన్ రమేష్, అజయ్, రాఘవేంద్ర , శ్యాంసుందర్, బుచ్చన్న, విజ్ఞానం, తిరుమల శ్రీను, వెంకటేష్, రాఘవేంద్ర, శేఖర్, అంజి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలుగా బలోపేతం : డీఈవో

వీపనగండ్ల, మే19: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని జిల్లా విద్యాధికారి గోవిందరాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మం డలంలో 18 ఆదర్శ పాఠశాలలగా ఎంపిక చేశామన్నారు. మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలకు మొదటిసారిగా వచ్చిన డీఈవోను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఈటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య సన్మానించారు. కార్యక్రమం లో ఎంఈవో లక్ష్మణ్ నాయక్,అమ్మ అధ్యక్ష పాఠశాల కమిటి చైర్మ న్ లలితమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాగునీటి సౌకర్యార్థం దిగువకు నీటి విడుదల



సమాంతర కాలువ ద్వారా దిగువకు విడుదలవుతున్న తాగునీరు

ఆత్మకూరు,మే19: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి తాగునీటి సౌకర్యార్థం దిగువకు నీటి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగన్మోహన్ తెలిపారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచే సమాంతర కాలువ ద్వారా ఆదివారం ఉదయం నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ వేసవికాలంలో తాగునీటి సమస్య తీరినట్లే అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో మూడున్నర టీఎంసీలకు పైగా ఉన్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిన్నంబావి, మే18: మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదోవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు . ఈ సందర్భంగా చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల్ రెడ్డి , యునస్ ఖాన్, అజీమ్ పాషా, అరుణ, జ్యోతిరాణి, వెంకటరమణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గోపాల్‌పేట, మే19: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుద్ధారం గ్రామంలో విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు ఉచిత సమ్మర్ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య, క్రీడాల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. విద్యార్థులు ఇలాంటి ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డిని విశ్వవాణి గ్రామభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

బీజేపీలో పలువురి చేరిక

వనపర్తి అర్బన్, మే19: దేశంలో బీజేపీ చేసిన అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు నారాయణ అన్నారు. ఆదివారం పెద్దమందడి మండల పరిధిలోని జగత్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువకులకు కండువాలు కప్పి నారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాలరాజు, అశోక్, ఆనంద్, యాదగిరి, శ్రీకాంత్, రవి, భాస్కర్, అనిల్, తిరుపతి , రాకేష్, ప్రవీణ్, శశి, చందు, రాజు, తదితరులు ఉన్నారు.



బీజేపీలో చేరిన యువకులు